# ఇగురం

భాగ్యరేఖ

చెప్పుల సప్పుడైతె బైటికి తొంగి సూశింది లచ్చిమక్క. మల్లైడ్డొచ్చిండు.

"ఏం జేస్తున్నవ్ చిన్నీ" అడ్గిండు లోపలి కొచ్చుకుంట.

"ఇప్పుడె ఇంటెన్క బట్టలు నానవెట్టొచ్చిన బిడ్డ! జెరైనంక విందుదామనీ!"

"నీ....యమ్మ! ఇంత ఏజైనంక నీకెందుకె బట్టలుత్కుడు, బాసన్లు దోముడూ... ఓ పన్మన్శిని పెట్టుకుంటే పాయె? ఒంద రూపాలకొచ్చినాది!"

"ఏ...పైసలకోసమార! నువ్వు! ఆల్లేంబాగ విండి సస్తరు? సబ్బు నీల్లల్ల నానినాని కొట్కపాయె, తట్టెడు సర్ఫేశి గాలవెద్తరు. దొబ్బ దొబ్బ ఒల్కవోస్తరు, పోతెవాయె అన్కిట్కి కన్లు మూస్కుందామంటె బట్టల మైలవోకపాయె. తూ... పాడువడ కొత్త బట్టలు గూడ నాల్రోజులకె గుడ్డికాయవారి ఇడ్శిన బట్టలోలె ఇకారంగ తయారైతయి. బాసన్ల సంగతైతె ఇగ జెప్పనేఒద్దు. ఏడి పాసు ఆడనె మల్ల దోంకోక దప్పకపాయె. ఏం పనిమన్శులురా పాస్కల్లె పనిమన్శులూ...."

"మరిగ చాతగాని పొద్దొస్తె ఏంజేస్తమే?" అన్నడు.

"ఇగ అప్పుడైతె దప్పదనుకో... అయినా అసుంటి దినాలు రాగూడదనే దినాం.... దేవున్కి మొక్కుతున్నరా!"

"ఇట్ల మా కాల్జేతులాడంగ, మా పన్లు మేం జేస్కోంగనే మమ్ము గొంటవొమ్మని ఆ పర్మాత్మను లేస్త కూసుంట మొక్కుతున్న కొడ్క. ఏం జేస్తడో... మమ్ము నెట్ల గొంటవోతడో అయ్యన్న దయ" రొండు చేతులెత్తి మొక్కింది.

సంచిలకెల్లి టిపిని డబ్బ దీశి లచ్చిమక్కకిచ్చిండు.

మల్లేం దెచ్చినవురా?" మూత దీస్కుంట అడిగింది.

"ఏంలే... జెరంత కూర దెచ్చినే"

"ఏ... ఎందుకు దెచ్చినవురా? ఐతారం ఐతారం దెప్పిచ్చి ఒండుతనే ఉన్న. ఈ ముసల్తనంల మాంసాల్దిని ఏ కష్టం జెయ్యవొయ్యేదుంది...?" అనుకుంట మల్లైడ్డి దిక్కు జూశింది.

"ఏంది బిడ్డ! మొకం గుంజుకపోయింది?"

మల్లైడ్డి మొకం న్యాలకేశి గూసుండు. సప్పుడు జెయ్యలె.

Scanned with CamScanner

"ఏంది కొడ్కా.... ఏందో పికర్ జేస్తున్నవూ... నాకు జెప్పగూడన్ది ఏముందిరా....? బార్తి బాగుందా?" లచ్చిమక్క గొంతు జెర చిన్నగ జేశి పరెశానైకుంట అడ్గింది.

"దానిగురించే గద చిన్నీ నాకున్న బాదంతా! పువ్వోలె వెంచి ఉన్నొక్క పిల్లను దీస్కపొయ్యి ఆ అడ్డమైన కొంపలేస్తి."

"మల్ల ఏమన్న తగాద జేశి(న్రా?"

"ఉట్టి తగాదలు ఎన్ని జేశినా తశివ జేశి తెంపొచ్చు గని... పిల్లను మల్ల గొట్టి దోలి(న్రు చిన్నీ! ఆల్ల మీద మన్నువడ"

"అఁ... పిల్లను గొట్టినారు? ఆల్ల చేతులకు జెట్టలు వుట్ట. మల్లేం రోగమొచ్చెనంట?"

"ఇంకేం రోగం... చాతగాని రోగం. సదువు మామూల్గ సదివినా, ఆర్టీసీల కొల్వుండు, ఇంత పొలమున్నది, ఒక్కడే కొడ్కు గదాని పిల్లనిస్తిమి.

ఉట్టి ఉద్యోగంల ఏమొస్తయి ఏదన్న బిజినెస్ వెట్టుకుంటనని ఒద్దనంగ పట్టు వట్టె... పోని తియ్... మంచిగ సంపాయిస్తె మన పిల్లనే సుకపడ్తది గదనని... పిల్ల పేర్మీద బ్యాంకు లేశిన. లక్ష రూపాల్దీశి చేత్ల వెట్టొస్తిమి. అవి అయిన్ని ముండమోపె. మీదంగ... ఏమన్కుంట ఇచ్చిండో మీ నాయ్న, అంత లాసొచ్చిందని అట్ల పిల్లను నల్చె. మ...ల్ల ఇది జేస్త అది జేస్తనంటె పిల్లగాడు ఉట్టిగ దిర్గుతె ఆవారగైతడు మనకే ఇకారమని అప్పుడిన్ని ఇప్పుడిన్ని... దెగ్గెర దెగ్గెర మల్లొక లక్ష సదిర్తి. అవ్వీ... దిగమింగె. మ...ల్లిపుడు పైనాన్సు వెడ్తమల్ల పైసల్దెమ్మన్నడంట. లక్షలక్షలు ఆల్లతాన ఎక్కడికెల్లి ఒస్తయి, ఇప్పడ్కే మస్తుగిచ్చి(న్రు సాలలేదా? అని పిల్ల అడిగిందని... ఒక్క తీర్గ గొట్టలే చిన్నీ! పెయినిండ వాతల్దేలినయ్, మొకమంత వాశింది. చాందినాలసంది అప్పుడప్పుడు గొడ్తనే ఉన్నరంట... నా తల్లి! మనం బాదపడ్తమని బూదేవి లెక్క ఎంత ఓర్సుకున్నదొ... ఈసారి తాలక ఈడవడ్డదా కొచ్చింది. నీకు దెల్సి నేనెవర్కన్న అన్యాయం జేశినానె చిన్ని! నాకే ఇంత కష్టమెందుకు వెట్టిండు బగమంతుడు" కండ్లల్ల నీల్లు దిప్పుకున్నడు మ(ల్రెడ్డి.

"నాయమ్మ! బంగారమసుంటి బిడ్డె. దాని అదుష్టంల ఇట్ల రాశిండేంరా దేవుడూ... మరెట్ల జేస్తనంటవ్రా?"

"చేశేదేముంది చిన్నీ! మల్లిన్ని పైసల్దీస్క పొయ్యి, మన్సురాయి జేస్కోని పిల్లనాడ దించొస్త"

లచ్చిమక్క ఉల్కిపడ్డట్టయింది.

"పిల్లేమంటుంది రా! మరీ..."

"మల్ల వోనంటె పోనంటుంది గని... ఆడివిల్లాయె కష్టమో... సుకమో... పోక దప్పుతదా"

"మరి పిల్లకిష్టం లేనప్పుడు సావుమని తోలిస్తవా?"

"అట్లంటెట్ల చిన్నీ! ఆడ కష్టముందని ఇంట్ల వెట్టుకుంటమా! పెండ్లయిన ఆడివిల్లను?"

"లే... ఆల్లు సంపుతె దెచ్చి బొందల వెట్కుంటము" కస్సున లేశింది లచ్చిమక్క

"లేకుంటేందిరా! పిల్లను తెల్చి తెల్చి మల్లా నర్కంలేస్తనంటవూ... పిల్లగాడు చాతగానోడని తెల్చేపాయె... ఆదు పిల్లనన్న మంచిగ సూస్కుంటుండా అంటే ఆదు, ఆని అమ్మ, అయ్య అందరు పసువులని దెల్చిపాయె. ఇంకేం సచ్చిందిరా ఆ యింట్ల... బంక...! నువ్వు లచ్చ ఇయ్యి, కోటియ్యి ఇగ బాయిల వోశినట్టే. పిల్ల పానాన్కి గూడ ముప్పే. మనకు పిల్ల, దాని పానం ముక్యం..."

"అట్ల మనమన్కుంటం గని.... లోకం" మద్యల్లో అందుకోవోయిండు మ(ల్రెడ్డి.

Scanned with CamScanner

"నీ... లోకం మీద మన్నువొయ్య! లోకానికి బయపడి ఇయ్యాల పిల్లనాడ దోల్నా... రేపు మన్సిరిగి పిల్లనే... ఏమన్న జేస్కునే... అల్లె దాన్నేమన్న జేశిరే... ఏ లోకమడ్డమొస్తదిరా? చెల్లింత పిల్లపోతె లోకం దెచ్చిస్తాదిరా? నీ దిమాకెక్కడ పన్జేస్తుందిరా మల్రెడ్డి...."

జెరాగి మల్రెడ్డందుకున్నడు.

"జానే చిన్ని! ఇయ్యాలంటె పిల్లను మేం నడ్పుతం. రేపు మేం సచ్చినంక ఎవరుస్తరు దాన్ని? దాని బత్కు ఆగం గాదే!"

"అయ్యో! ఏకాలంలున్నవురా పిల్లగా? దాన్నొకరు నడ్పేదేందిరా? అంతో ఇంతో సదువుకున్నది పన్నెండోద్దాక. కాలేజికి పంపు... పైకి సద్వి పియ్యి, రేపు దాని పొట్టకు బట్టకే గాదు, ఇంక పదిమందిని నడ్పనీకే సరిపోను సంపాయిస్తది. దాని కాల్లమీద అది నిలవడ్తది. ఆనాడె అది పెండ్లొద్దు గిప్పుడే... డిగ్రి సదువుతనంటె ఇనకపోతివి. ఆ సారు గూడ తనంతల తనే నీ ఇంటి కొచ్చి, పిల్లకు అన్నిట్ల తొంబైమీద మార్కులొచ్చినయ్ డాక్టర్ సదువు సదివిపిస్తె తప్పక సీటొస్తదని ఒక్క తీర్గ జెప్పిపాయె. మంచి సంబందం మంచి సంబందం అన్కుంట... నీకు ఉష్ప నిల్వక పాయె" జెర దమ్ము దిని మల్లందుకుంది లచ్చిమక్క

"తెల్వక ఓపారి తప్పు జర్గిపొయ్యింది. తెల్చి మల్ల తప్పుజెయ్యకు కొడ్కా... అన్నాయం జరిగినపుడు ఆడి పిల్లకు అమ్మగారి అండ కొండంత బలం బిడ్డా. మొగోన్ని గద ఏం జేశిన నడుస్తదంటనని అనుకున్నడేమొ. అన్కి గూడ చెప్పుతోటి గొట్టినట్టయితది."

నేన్జెప్పేది జెప్పిన ఇగ నీ ఇష్టమన్నట్టు ఊకుంది లచ్చిమక్క కూసోని కూసోని లేశిండు మల్రెడ్డి.

"పోతున్న చిన్నీ! పోత పోత ఆ సార్‌ను కల్సు కుంటపోత. ఎట్ల ఇది జూన్ నెలనే, పిల్లను ఏ కాలేజిలేస్తె బాగుంటదో కనుక్కుంటపోత"

లచ్చిమక్క పానం నింబడమైంది.

*వార్త ఆదివారం*
*20 జూన్, 2004*